పశువులకు గాలి కుంటు టీకాలు వేయించాలి

విశాలాంధ్ర - గొలుగొండ: జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా ఈనెల 20 నుండి సెప్టెంబర్ 18 వరకు జరుగుతున్న గాలి కుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని పాడి రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కృష్ణదేవిపేట వెటర్నరీ డాక్టర్ శిరీష తెలిపారు. గాలికుంటు వ్యాధి సోకకుండా పాడి రైతులందరూ టీకాలను తమ పశువులకు వేయించుకోవాలని ఆమె తెలిపారు. ఈ టీకాలు వేయించడం ద్వారా వ్యాధి సోకిన పాడి పశువుల్లో తగ్గే ఉత్పత్తిని శాశ్వతంగా నివారించవచ్చు అన్నారు. దూడల్లో మరణాలను తగ్గించి ఆరోగ్యవంతంగా ఎదగడానికి ఉపయోగపడతాయని డాక్టర్ శిరీష తెలియజేశారు.

పెదముషిడివాడలో ఆగని భూకబ్జాలు

- పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - పరవాడ: ప్రభుత్వం మారింది. అయినా వైసీపీ నాయకుల కబ్జాలు ఆగలేదు. గెడ్డలను పూడ్చేస్తూ ప్రభుత్వ భూములను అమ్మేస్తున్నారు. గత ఐదేళ్లు చేసిన అక్రమాలను కొనసాగిస్తూ గెడ్డలు, వాగులు, చెరువులు, కొండ పోరంభోకు భూములను ధర్జాగా కబ్జా చేస్తున్నారు. అధికారులు మాత్రం తమకేమీ సంబంధం లేనట్టు చూస్తున్నారు. పరవాడ మండలం పెదముషిడివాడ పంచాయితీలో జరుగు తున్న అక్రమాలకు అడ్డేలేకుండా పోతోంది. ప్రస్తుతం సర్వేనెంబర్ 388లో గెడ్డ కబ్జాకు గురైంది. గెడ్డలోని చెట్లను నరికేసి కొంతమేర గెడ్డను పూడ్చేసారు. గ్రామంలో ఆంజనేయ సామి గుడికి అతి సమీపంలో మరో గెడ్డను రాత్రికి రాత్రే పూడ్చేసారు. గెడ్డ పక్కనే ఓ ప్రైవేట్ భవనం నిర్మాణం జరుగుతోంది. దానికి సరైన మార్గం లేకపోవడంతో గెడ్డను కప్పేసారు. వైసీపీ చోటా నాయకుడొకరు బేస్‌మెంట్ ఫిల్లిం గ్‌తో పాటు గెడ్డను కప్పేసి ఇచ్చేందుకు ఐదారు లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. పైగా ఇటీవల రెండు సార్లు గెడ్డ ఆక్రమణను రెవెన్యూ సిబ్బంది కూడా అడ్డుకున్నారు. అయితే ఆదివారం రాత్రి లారీలతో గ్రావెల్ తీసుకొచ్చి తెల్లవారే సరికి గెడ్డను పూడ్చేసి జేసీబీతో చదును చేసేసారు. అదే విధంగా సర్వే నెంబర్ 407 కొండ పోరంబోకు స్థలాన్ని కూడా ఆక్రమించేందుకు సిద్ధం అయ్యారు. గత కొన్ని రోజులుగా జేసీబీతో చదును చేస్తున్నారు. ఈ స్థలంలో ప్లాట్లు వేసి ఇప్పటికే కొన్ని ప్లాట్లను అమ్మేసినట్లుగా తెలుస్తోంది. గతంలో ఇదే కొండ పోరంభోకు స్థలంలో అక్రమ మైనింగ్ జరిపించిన ఆ చోటా నాయకుడు కోట్లు కొల్లగొట్టాడు. అప్పట్లో అధికారాన్ని అడ్డం పెట్టుకుని విచ్చలవిడిగా అక్రమాలు చేసాడు. గత ఎమ్మెల్యే సహాయ సహకారాలు పుష్కలంగా ఉండటంతో ఈ పంచాయితీలో లెక్కకు తేలని అక్రమాలు చోటు చేసుకున్నాయి. వీటిపై అధికారులు కూడా పట్టించు కోకపోగా అక్రమార్కులకే కొమ్ము కాస్తూ వచ్చారు. స్పందనలో చేసిన పిర్యాదులకు సైతం తప్పుడు నివేదికలను సమర్పించి ఆ పిర్యాదులను క్లోజ్ చేసేవారు. అయితే కొన్ని ఆక్రమణలపై పదే పదే పిర్యాదులు వెళ్లడంతో విచారణ అనంతరం వీఆర్వోపై వేటు వేసారు. కానీ ఆక్రమణలను అడ్డుకోలేదు. అవి కాస్త పూర్తయిపోయాయి. అయితే ప్రభుత్వం మారిన వెంటనే పెదముషిడివడలో జరిగిన అక్రమాలపై చర్యలు ఉంటాయని కూటమి నాయకులు చెబుతూ వచ్చారు. తీరా కూటమి అధికారంలోకి వచ్చి రెండు మాసాలు కూడా పూర్తయింది. కానీ పెదముషిడివాడలో భూ కబ్జాలకు అడ్డకట్ట పడటం లేదు. చర్యలు ఎలా ఉన్నా ప్రభుత్వం మారినా ఆక్రమణలు ఆగకపోవడం పెద్ద చర్చనీయాంశంగా మారింది.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

విశాలాంధ్ర - కే.కోటపాడు: ప్రభుత్వం నిర్వహిస్తున్న పొలంబడి ద్వారా రైతులు పంటలపై అవగాహన కలిగించుకోవాలని, సాంప్రదాయ పద్ధతిలో వ్యవసాయం చేయకుండా ఆధునిక పద్ధతిలో సాగు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. మంగళవారం ఆర్వై అగ్రహారంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరిలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. లైన్ సోయింగ్ పద్ధతిలో వరి నాట్లు వేయాలన్నారు. దీనివల్ల అధిక పురుగు మందులు వాడనవసరం లేదని అన్నారు. మేలైన యాజమాన్య పద్ధతులను పాటిస్తూ మంచి నాణ్యమైన దిగుబడులు సాధిస్తే రైతుకు మంచి ఆదాయం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగభూషణం, చిరికి వెంకటరమణ, అచ్చం నాయుడు, ఏఈఓ లైలా దేవి, వ్యవసాయ సహాయకులు కళ్యాణి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం

విశాలాంధ్ర - చీడికాడ: మండలంలోని తురువోలు గ్రామంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పెదగోగాడ పశువైద్యాధికారిణి కేవీఎస్ రాఘవమ్మ ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘం జిల్లా ఎగ్జిక్యూటివ్ అధికారి రామ్మోహనరావు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. 31 గర్భకోశ వ్యాధులు, 23 ఎదకురాని పశువులకు, 16 చూడి పరీక్షలు, 17 పశువులకు నట్టల నివారణ మందులు, 98 పశువులకు గాలికుంటి వ్యాధి నివారణ టీకాలు, 40 పశువులకు సాధారణ చికిత్స అందించి వాటికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బిలా కోటి, సర్పంచ్ మట్టా అప్పారావు, ఉప సర్పంచ్ పోతల పైడితల్లి బాబు, మాడుగుల పశువైద్యశాల సహాయ సంచాలకులు చిట్టినాయుడు, ఖండివరం పశువైద్యాధికారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల వైద్యం పట్ల నిర్లక్ష్యం తగదు

విశాలాంధ్ర - వి.మాడుగుల: పేదలకు అందించే వైద్యం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి ఇరట నరసింహమూర్తి అన్నారు. మంగళవారం మాడుగుల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. ఆసుపత్రిలో ఎనిమిది మంది డాక్టర్లకు గాను ఏడుగురు ఉన్నారని, ఇందులో ఒకరు ప్యామిలీ ఫిజీషియన్ క్యాంపునకు వెళ్లిపోతా రన్నారు. సోమవారం రోగులకు అవసరమైన మందులు ఇస్తు న్నారని, మిగిలిన రోజుల్లో మందులు ఇవ్వడం లేదన్నారు. కొన్ని వైద్య పరీక్షలకు బయట ఉన్న ల్యాబ్‌కు పంపిస్తున్నారని సూపరిం టెండెంట్ చంద్రశేఖర్ దృష్టికి తీసుకువెళ్లారు. వర్షం వస్తే ఆసుపత్రి కారిపోతుందని తెలిపారు. కరెంట్ లేకపోతే జనరేటర్ సౌకర్యం లేక ఇన్వర్టర్లు సక్రమంగా పనిచేయక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎక్సరే సౌకర్యం లేక రోగులు ఎక్స్‌రే పరీక్షల కోసం ఇతర ప్రాంతాలకుపోతున్నారని తెలిపారు. ఎపిడిమిక్ సీజన్ రావడంతో జ్వరాలు తీవ్రంగా ఉన్నాయని ప్రభుత్వ పేదలకు అందించే వైద్యం పట్ల నిర్లక్ష్యం చేయడం వలన ప్రైవేటు ఆసుపత్రుల వైపు ప్రజలు ఎగబడి వేలాది రూపాయలు ఖర్చు పెట్టుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం దేవరాపల్లి మండల కార్యదర్శి బిటి.దొర, మండల నాయకులు కె.భవాని తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులను ఆదుకోకపోవడం అన్యాయం

విశాలాంధ్ర - నక్కపల్లి: నక్కపల్లి మండలంలో వైజాగ్ చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్‌లో భాగంగా ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల కొరకు భూములు, ఇల్లు జీవితాలు త్యాగం చేస్తున్న రైతులను, మత్స్యకారులను, దళితులను, నిర్వాసితులను ప్రభుత్వం 2013 భూ సేకరణ చట్టం అమలు చేసి ఆదుకోవాలని కోరుతూ మంగళవారం నక్కపల్లి తహశీల్దార్ అంబేద్కర్‌కు రాష్ట్ర వైసీపీ నాయకులు వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజుల సారధ్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ ప్రాంతం అభివృద్ధి కోసం, పరిశ్రమల కోసం రైతులు భూములు, ఇల్లు త్యాగం చేసి రావాల్సిన నష్టపరిహారం, ప్యాకేజీ కొరకు సంవత్సరాల తరబడి కార్యాలయాలు చుట్టూ తిప్పడం చాలా అన్యాయం అన్నారు. ఇల్లు కోల్పోతున్న వారికి ఇరవై ఐదు లక్షలు, భూములు కోల్పోయిన కారణంగా ఉపాధి కోల్పోతున్న వారికి పదిహేను లక్షలు భూములు స్వాధీనం చేసుకునే సంవత్సరాన్ని కటాఫ్ తేదీగా భావించి అప్పటికి పద్దెనిమిది సంవత్సరాలు నిండిన వారికి ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ సమక్షంలో నిర్వాసితులతో సమావేశం నిర్వహించి, నిర్వాసితులను ఏవిధంగా ఆదుకుంటారో ప్రకటించాలని, నిర్వాసితుల అభిప్రాయాలును కూడా పరిగణ నలోకి తీసుకుని నిర్వాసితులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాసి తులు నాయకులు తాళ్ళ భార్గవ్, గంటా తిరుపతిరావు, ఎం.రాజేష్, వైసీపీ జిల్లా నాయ కులు సురకాసుల గోవిందరావు, జి.గోవిందరావు, వి.క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, ఫ్యాన్లు వితరణ

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం అంబేద్కర్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్, రిటైర్డ్ సివిల్ జడ్జి నడుపూరు సన్యాసిరావు ఆధ్వర్యంలో చోడవరం పట్టణంలో గల ఇందిరా కాలనీలో గల సాంఘిక సంక్షేమ శాఖ మహిళా హాస్టల్‌కి, ఎల్ఐసి కాలనీలో సాంఘిక సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం విద్యార్థులకు 4 ఫ్యానులు, నోటు పుస్తకాలు, పెన్నులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు విద్యార్థులు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ట్రస్ట్ కార్యనిర్వాహకులు కందెల్లి వెంకట్రావు, జింజూరు అప్పారావు, వి.పైడారావు, అడ్వకేట్ భూపతి రాజు, హాస్టల్ వార్డున్ బి.ఈశ్వరరావు, జి.వరలక్ష్మి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల వ్యవస్థాపక దినోత్సవం

విశాలాంధ్ర - పాయకరావుపేట: శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల 48వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్పేసెస్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ తమ విద్యార్థులు ప్రతీ సంవత్సరం విద్యా సంస్థల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రక్తదానం చేస్తున్నట్టు తెలిపారు. 2004 నుండి ఇప్పటివరకూ సుమారు 2200 యూనిట్ల రక్తాన్ని ఇచ్చి తమ సేవానిరతి చాటుకున్నారని, అపదలో ఉన్నవారికి రక్తదానం చేసి మరో వ్యక్తి జీవితాన్ని నిలబెట్టారని తెలిపారు. మంగళవారం జరిగిన రక్తదాన శిబిరంలో 60 యూనిట్ల రక్తాన్ని మదర్ బ్లడ్ బ్యాంకుకు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.సత్యనారాయణ, మదర్ బ్లడ్ బ్యాంకు డైరెక్టర్ డి.శివ గుప్త, స్పేసెస్ డిగ్రీ కళాశాల ఎన్.సి.సి, ఎన్.ఎస్.ఎస్, రోటరాక్టు యంగ్ లీడర్స్, సబల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గోవాడ సుగర్స్ రైతులకు బకాయిలు చెల్లించాలి

విశాలాంధ్ర - చోడవరం: గోవాడలో 2023-24 క్రషింగ్ సీజన్‌కు గాను చెరకు సరఫరా చేసిన సభ్య రైతులకు బకాయి పేమెంట్లు నేటికీ పూర్తి స్థాయిలో చెల్లించక పోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారని ఏ.పి చెరకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేచలవు వెంకట రమణ (కాసు బాబు) అన్నారు. స్థానిక మీడియాతో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు, చెరకు రైతు సంఘం నేతలు మాట్లాడుతూ గోవాడ చక్కెర కర్మాగారానికి సరఫరా చేసిన సభ్య రైతులకు బకాయి పేమెంట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ఎం.డి. వి.ఎస్.నాయుడు ఈ ఏడాది జూన్ చివరి వారంలో ప్రకటించారని, బకాయిలపై ఎం.డి. ప్రకటన విడుదల చేసి రెండు నెలలు దాటుతున్నా నేటికీ సభ్య రైతుల ఖాతాలో చెరకు పేమెంట్లు జమ కాలేదని తెలిపారు. దీనిపై ఫ్యాక్టరీ యాజమాన్యం స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా దాటేయడంతో చెరకు రైతుల్లో మరింత ఆందోళన మొదలైందన్నారు. 2023-24 క్రషింగ్ సీజన్లో ఫిబ్రవరి 16 నుండి మార్చి 12 వరకు అనగా ఫ్యాక్టరీలో క్రషింగ్ నిలిపివేసే వరకు 6346 మంది మొదటి విడతగా టన్నుకు రూ.2,500లు చొప్పున సభ్య రైతులకు బకాయి పడిన రూ.15.32 కోట్లు చెల్లింపులు జరుపుతామని ఈ ఏడాది జూన్ 29న పత్రికా ప్రకటన చేసి ఉన్నారన్నారని తెలిపారు. మిగిలిన బకాయిలు టన్నుకు రూ. 419.75 పై.లు రెండవ విడతలో జమ చేస్తామన్నారని, కొంతమంది రైతులకు పేమేంట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసినప్పటికి, పలు కాటాల పరిధిలో సుమారు రూ.7.5 కోట్లు పేమెంట్లు జమ చేయవలసి వుందన్నారు. కార్మికులకు బకాయి పడిన పేమెంట్లు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సుగర్స్ యాజమాన్యాన్ని వివరణ కోరగా 10 రోజుల్లో బకాయిలు చెల్లిస్తామని చెప్పారు.

పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధికి కృషి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్టు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మంది రంలో జిల్లాలోని వివిధ రకాల పారిశ్రామికవేత్తలు, ఇండస్ట్రియల్ యూనియన్ల, అసోసియేషన్ ప్రతినిధులతో ప్రత్యేక జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు మౌలిక సదుపాయాలను మెరుగు పరచడం, నిబంధనలను క్రమబద్ధీ కరించడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి విధానం 2024-29, ఎంఎస్‌ఎంఈ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పాలసీ 2024-29, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ-2024-29 రూపకల్పన ప్రక్రియ చేపట్టిందన్నారు. ఈ నేపథ్యంలో పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుం దన్నారు. పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా కృషి చేయడం జరుగు తుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, రెవెన్యూ డివిజనల్ అధికారి చిన్న కృష్ణ, జిల్లా పరిశ్రమ శాఖ జిఎం శ్రీధర్, జోనల్ మేనేజర్ ఏపీఐఐసీ హరి ప్రసాద్, అగ్నిమాపక శాఖ అధికారులు, జిల్లా అధికారులు, పారిశ్రామికవేత్తలు, ఇండస్ట్రియల్ యూనియన్ల అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: దేశంలో శాస్త్ర సాంకేతిక రంగం అభివృద్ధిలోకి రావడానికి అప్పటి భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీనే కారణమని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి ఐ.ఆర్.గంగాధర్ అన్నారు. మంగళవారం అనకాపల్లి రైల్వే స్టేషన్ రోడ్‌లో గల కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయంలో భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి గంగాధర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ దేశాన్ని పునాదుల నుంచి నిర్మించి అన్ని రంగాల్లో భారత్ అభివృద్ధి సాధించే విధంగా రాజీవ్ గాంధీ కృషి చేశారని అన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను నెరవేర్చుటకు నేటి యువత కృషి చేయాలని కోరారు. యువత రాజకీయాల్లోకి రావాలని సదుద్దేశంతో యువకులకు 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించారని, రాజీవ్ గాంధీ వ్యక్తి కాదని మహాశక్తి అని కొనియాడారు. కశింకోట మండల కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు సనేడ గజ్జాలు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి సాధిం చిందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు ఎగ్గాడ భాస్కరరావు, యువజన కాంగ్రెస్ నాయకులు కొల్లి సత్యారావు, డిబి కాలనీ నాయకులు గంట్యాడ సత్తిబాబు, బీసీ సంఘం నాయకులు గుతుర్తి అప్పారావు, దళిత నాయకులు ఒరేలా వెంకటరమణ పాల్గొన్నారు.

చిన్నారుల మృతికి కారకులైన వారిని శిక్షించాలి

విశాలాంధ్ర - కోటవురట్ల: కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలో ఉన్న పాషా ఆశ్రమానికి చెందిన ముగ్గురు విద్యార్థుల మరణానికి గల కారణాలను వెలికి తీసి బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని మండల టీడీపీ అధ్యక్షులు జానకి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన ఆశ్రమ ప్రాంతాన్ని పరిశీలించి చిన్నారుల మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమం యొక్క పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అనాథాశ్రయంలో ఆశ్రయం పొందుతున్న గిరిజన చిన్నారులు మృతి తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులు మృతికి నిర్వాహకుడు నిర్లక్ష్యమే కారణంగా కనిపిస్తుంది అన్నారు. కలుషిత ఆహారం తీసుకున్న చిన్నారులను వారి గ్రామాలకు పంపించకుండా హాస్పటల్లో చేర్పించి వైద్య సేవలు అందిస్తే పిల్లలకు మరణాలు తప్పేవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనపై అధికారులు దర్యాప్తు చేసి చిన్నారుల మరణానికి గల కారణాలను వెలికి తీయాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు. జెడ్పిటిసి ఉమాదేవి గ్రామస్తులు అనాథాశ్రయానికి చేరుకొని చిన్నారుల మరణానికి గల కారణాలను అన్వేషించారు.

ఘనంగా ఎమ్మెల్యే సుందరపు జన్మదిన వేడుకలు

విశాలంధ్ర - అచ్యుతాపురం: ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ జన్మదిన వేడుకలను రక్తదాన శిబిరం, సేవ కార్యక్రమాలతో మంగళవారం జనసేన పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే స్వగ్రామమైన కొత్తూరు గ్రామంలో గుమ్మడమ్మ తల్లి అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన నాయకులు, సుందరపు అభిమానులు ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై అభిమానంతో రక్తదానం చేసిన అభిమానులకు, కూటమి నాయకులకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఉత్తరాంధ్ర రాజకీయ వ్యవహారాల ముఖ్య ప్రతినిధి సుందరపు సతీష్ కుమార్ కొండకర్ల ఇఖ్రా ఫౌండేషన్ అనాధ ఆశ్రమానికి 50 వేల రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి నియోజవర్గం నాలుగు మండలాల కూటమి నాయకులు బైలపూడి శ్రీరామదాసు, కొరుపోలు చిన్నారావు, ద్వారపురెడ్డి బాబ్జి, మేరుగు ప్రవీణ్ కుమార్, పోలవరపు పారునాయుడు, సూరాడ ధనరాజు పాల్గొన్నారు.

యస్.రాయవరం: యలమంచిలి శాసనసభ్యుడు సుందరపు విజయకుమార్‌కు పాయకరావుపేట నియోజకవర్గం జనసేన నాయకులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఇంటి వద్ద పాయకరావుపేట నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జ్ గెడ్డం బుజ్జి ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షులు వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యస్.రాయవరం మండల పార్టీ అధ్యక్షుడు పప్పల శివ కూడా శుభాకాంక్షలు తెలిపారు.

మునగపాక: మండల కేంద్రంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నందీశ్వరుని ఆవరణలో బ్లడ్ బ్యాంక్ నిర్వహించారు. అనంతరం పేదలకు కాయగూరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ ఉత్తరాంధ్ర ముఖ్య ప్రతినిధి సుంద రపు వెంకట సతీష్ కుమార్ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మునగపాక మండల ప్రజలు మాకు ఎప్పుడూ అండగా ఉంటారని అన్నారు. ప్రజలకు ఏ కష్టమొచ్చినా మాకు తెలియ జేయాలని అన్నారు. మండల పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశురాం, ఎంపీపీ మల్ల జయలక్ష్మి, కాళ్ళ, బొడ్డేడ అప్పలనాయుడు, సూరిశెట్టి అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో హైస్కూల్ చైర్మన్ ఆడారి సూరి చంద్రరావు, కారుకొండ కాశీ అధిక సంఖ్యలో జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ నిర్వాహకుడికి రిమాండ్

విశాలాంధ్ర - కోటవురట్ల: అనధికారికంగా ఆశ్రమాన్ని నిర్వహిస్తూ ముగ్గురు గిరిజన చిన్నారుల మరణానికి కారకులైన ఆశ్రమ నిర్వాహకుడు ఎం.కిరణ్ కుమార్‌కి రిమాండ్ విధించినట్లు నక్కపల్లి సిఐ అప్పన్న తెలిపారు. మంగళవారం కిరణ్ కుమార్‌ని నర్సీపట్నం మెజిస్ట్రేట్ వద్ద హాజరుపరచగా ఆయన సెలవులో ఉన్నందున చోడవరం మెజిస్ట్రేట్ వద్ద హాజరు పరిచినట్లు ఆయన తెలిపారు. అనాథాశ్రయం నిర్వహణ, చిన్నారుల మరణానికి గల కారణాలను లోతుగా అన్వేషించి, బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఆయన వెంట ఎస్సై రమణయ్య ఉన్నారు.

వాటర్ ట్యాంకులను
క్లోరినేషన్ చేయించాం

విశాలాంధ్ర - గొలుగొండ: మండలంలో మేజర్ పంచాయతీ ఏఎల్ పురం గ్రామంలో ఉన్న మంచినీటి వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయిస్తూనే ఉన్నామని సర్పంచ్ లోచల సుజాత పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసు స్పష్టం చేశారు. ఎల్ పురం గ్రామంలో ఎస్టి, బీసీ కాలనీలో వాటర్ ట్యాంకులకు మెట్లు ల్యాండింగ్ గతంలో ఇబ్బంది ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ గ్రామంలో ఉన్న అన్ని ట్యాంకులతో పాటు వీటిని ఏదో ఒక విధంగా క్లోరినేషన్ చేయించే వాళ్ళమని అన్నారు. ప్రస్తుతం ఎస్టి బిసి కాలనీలో ట్యాంకులకు మెట్లు సమస్య లేకుండా ఐరన్ తో నిచ్చెనలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఎస్టీ కాలనీలో ఉన్న వాటర్ ట్యాంకును జూన్ నెల ఆరవ తేదీన బ్లీచింగ్ వేయించి శుభ్రం చేయించమని అదే ట్యాంకుకు జులై నెలలో 8వ తేదీన పంచాయతీ సిబ్బందితో దగ్గరుండి క్లోరినేషన్ చేయించడం జరిగిందని అన్నారు. అలాగే బీసీ కాలనీలో ఉన్న ట్యాంకును ఆగస్టు నెలలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసు దగ్గర ఉండి తమ సిబ్బందితో శుభ్రం చేయించి క్లోరిషన్ చేయించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె పంచాయతీ సర్పంచ్ గా గ్రామ ప్రజలందరికీ పెద్దలకు రాజకీయ పార్టీల నాయకులకు తెలియజేయునది ఏమనగా గ్రామము నుండి తమ దృష్టికి వస్తున్న ప్రతి సమస్యను పంచాయతీ మౌలిక పరిస్థితులు ఆర్థిక పరిస్థితులు దృష్టిలో ఉంచుకొని 100 శాతం పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నామని దయచేసి ప్రతిదాన్ని రాజకీయ కోణంలో చూసి ఆటంక పరచవద్దని వినయ పూర్వకంగా అందరిని కోరుచున్నామని ఈ సందర్భంగా సర్పంచ్ లోచల సుజాత తెలియజేశారు.

వ్యవసాయ పంపుసెట్లకు
స్మార్ట్ మీటర్లు అప్రజాస్వామ్యం

విశాలాంధ్ర - మునగపాక: రైతులు అనుమతులు లేకుండా వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించడం అప్రజాస్వామ్యం అని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిపిఎం మండల కార్యదర్శి ఎస్.బ్రహ్మాజీ ధ్వజమెత్తారు. మండలంలోని చూచుకొండ గ్రామంలో మంగళవారం రైతు కమతాల వద్దకు వెళ్లి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమతో కనీసం మాట కూడా చెప్పకుండా గుట్టు చప్పుడు కాకుండా తమ మోటార్లకు మీటర్లు బిగించిన వైనాన్ని స్థానిక రైతులు వారితో మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రం మునగపాక తో పాటు పలు గ్రామాలలో స్మార్ట్ మీటర్లు బిగింపులను సిపిఎం, ఏపీ రైతు సంఘం రైతులతో అడ్డుకోవడంతో విద్యుత్ అధికారులు మోటార్లను బిగింపును ఆపారు అన్నారు. మారుమూల గ్రామాలలో గుట్టుచప్పుడు కాకుండా దొడ్డిదారిన మీటర్లు బిగించడం యధావిధిగా కొనసాగుతున్నాయి అన్నారు. ఉచిత విద్యుత్తుకు తూట్లు పొడిచే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పావులు కదపటం దురదృష్టకరమన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపు పై గత ప్రభుత్వం అనుసరించిన విధానాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేయడం సిగ్గుచేటు అన్నారు. రైతులకు గుదిబండగా మారనున్న స్మార్ట్ మీటర్లు బిగింపును కూటమి ప్రభుత్వం రద్దు చేసి అన్నదాతలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పెంటకోట అప్పారావు, ఆంజనేయుడు, దొడ్డి అప్పారావు పాల్గొన్నారు.

మైచర్లపాలెం గ్రామంలో శ్రీరామునికి
సామూహిక హారతి

విశాలాంధ్ర - చోడవరం: మండలంలోని మైచర్లపాలెం గ్రామంలో భక్తులు, గ్రామస్తులు గణపతి సహిత మహాలక్ష్మి, శ్రీ సీతారాములు వారికి సోమవారం రాత్రి సామూహిక హారతి అందజేశారు. శ్రావణ పూర్ణిమ సందర్భంగా సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీరామునికి పురుష సూక్త విధానంలో యధావిధిగా ప్రత్యేక అర్చన, అభిషేకములు జరిపించిన అనంతరం సంపూర్ణ సామూహిక పౌర్ణమి హార తులు అందజేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బూరె మాణిక్యం, ఆలయ ప్రధాన అర్చకులు పారుపూడి వెంకట సత్యనారాయణ మూర్తి, గ్రామస్తులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతీ నెల వచ్చెడి పౌర్ణమి నాడు శ్రీ సీతా రాములు వారికి సామూహిక హారతులు అందజేస్తామని వారు తెలిపారు. అనంతరం పౌర్ణమి ఘడియల్లో రాముల వారి ఆలయంలో హరి నామ భజనలు జరిపారు.

కోల్‌కతా వైద్యురాలి హత్యా
నిందితులను శిక్షించాలి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: కలకత్తాలోని ఆర్.కె.జి. మెడికల్ కాలేజీలో పీజీ రెండో సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థినిని అత్యంత దారుణంగా హింసించి, అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పిడిఎస్ఓ, స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీడీయస్ఓ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.భాస్కర్, స్త్రీ విముక్తి సంఘటన నాయకురాలు జి.ఉషలు మాట్లాడుతూ 36 గంటలు పాటు డ్యూటీ చేసి, విశ్రాంతి కోసం వెళ్లిన ఆమెపై హాస్పిటల్ ఆవరణలోని సెమినార్ హాల్లోనే ఈ ఘోరమైన దురాగతానికి పాల్పడ్డారంటే మహిళల భద్రత ఎంత ప్రశ్నార్థకంగా వుందో అర్థమవుతుందన్నారు. నిరంతరం ప్రమాదాల అంచున ఎలాంటి రక్షణా లేని వాతావరణం మధ్య మహిళలు పనిచేస్తున్న కఠిన వాస్తవంతో పాటు, మహిళలకు ఎలాంటి రక్షణా కల్పించలేని పాలకుల ఘోర వైఫల్యం మరొక్కసారి వెల్లడైందన్నారు. జరిగిన ఈ దుర్మార్గం పట్ల దేశవ్యాప్తంగా వైద్య విద్యార్థులు తీవ్రమైన భయాందోళనలను, ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడికక్కడ ఎమర్జెన్సీ విధులను బహిష్కరించి ఆందోళనలు సాగిస్తున్నారు. ఎప్పుడైనా ఎక్కడైనా తమపై దాడి జరగడానికి అవకాశం ఉందని, తమకు హాస్పిటల్స్‌లో సరైన రక్షణ వ్యవస్థలు లేవని, రక్షణ కల్పించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారని అన్నారు. హాస్పిటల్స్‌లో నైట్ డ్యూటీలు చేసేవాళ్లు ఒక బిల్డింగ్ నుంచి వేరే బిల్డింగ్‌కు వెళ్లాలంటే సరైన రక్షణ లేని పరిస్థితి వుందన్నారు. 24 గంటలు, 36 గంటలు పనిచేస్తున్న వైద్యులకు విశ్రాంతి తీసుకోవ డానికి సరైన వసతులు లేవని, మహిళా డాక్టర్లు, మహిళా ఉద్యోగుల రక్షణ కోసం ప్రత్యేకమైన చర్యలేమీ ప్రభుత్వాలు చేపట్టడం లేదన్నారు. హాస్పిటల్ నిర్వహణకు సంబంధించి వివిధ విభాగాలతోపాటు సెక్యూరిటీ విభాగం కూడా ప్రైవేట్ వ్యవస్థ చేతిలోనే వుందన్నారు. కార్పొరేటు శక్తులకు అనుకూలంగా విధానాల్ని అమలు చేస్తున్న పాలకులు ప్రభుత్వ వైద్య వ్యవస్థ పట్ల దారుణమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. ఈ అంశాలన్నీ కూడా ప్రభుత్వ హాస్పటళ్లలో అభద్రతా వాతావరణానికి, డాక్టర్లపై దాడులకు కారణంగా ఉన్నాయన్నారు. మహిళలపై నిత్యం జరుగుతున్న హింసాత్మక లైంగిక దాడులకు, హత్యలకు వ్యతిరేకంగా మన నిరసనను, ఆగ్రహాన్ని బలమైన గొంతుతో వ్యక్తం చెయ్యాలని పిలుపునిచ్చారు. పని ప్రదేశాల్లో మహిళల రక్షణ కోసం నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కన్వీనర్ లక్ష్మీకుమారి మాట్లాడుతూ. నానాటికీ పని ప్రదేశాల్లోనూ, విద్యాలయాలలోనూ మహిళలకు భద్రత లేకుండా పోతున్నదనీ, ప్రాణాలను కాపాడే వైద్యులను సైతం వదలక అత్యాచారాలకు గురిచేయడం దారుణమని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడిచినా, మన దేశంలో పేదలు, దళితులు, మహిళలు ఇంకా నిత్య పీడనకు గురవుతూనే ఉన్నారనీ, ప్రజలు సంఘటితమై తమ జీవితాలను నానాటికీ దుర్భరం కావిస్తున్న అంశాలపై సమైక్యంగా పోరాడితే తప్ప ఈ వ్యవస్థ బాతకనివ్వడం లేదని అన్నారు. ర్యాలీలో విద్యార్థులు, మహిళలు స్త్రీ విముక్తి సంఘటన నాయకులు సింధు, మని, కుమారి తదితరులు పాల్గొన్నారు.

చోడవరం: కలకత్తా ఆర్.కె.జి. వైద్య కళాశాలలో పి.జి. డాక్టర్ మౌమితపై జరిగిన హత్యాచారాన్ని ఖండిస్తూ, దోషుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అనకాపల్లి జిల్లా చోడవరం కొత్తూరు జంక్షన్లో సీ.ఐ.టీ.యూ., ఎస్.ఎఫ్.ఐ.ఆద్వర్యం లో ఆందోళన చేసారు. అనంతరం మానవహారం ఏర్పడి మహిళలపై హత్యాచారాలు అరికట్టాల్సిందిగా కోరుతూ భారీ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీ.ఐ.టీ.యూ. జిల్లా మహిళా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి మాట్లాడుతూ మహిళా పి.జి.డాక్టర్‌పై అత్యాచారానికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తక్షణమే తీసుకుని కఠినంగా శిక్షించాలన్నారు. బెంగాల్ ప్రభుత్వం అసలు దోషులను దాచి పెడుతూ, ఒక్కరిని మాత్రం అరెస్టు చేయటం దుర్మార్గం అని, మహిళలకు ఎక్కడా రక్షణ లేకుండా పోతుందని, పని ప్రదేశాల్లో అస్సలే లేదన్నారు. ఇంట్లో కూడా రక్షణ లేకుండా పోతుందని, ప్రభుత్వాలు కఠినమైన చర్యలు తీసుకోవాలని, మహిళలకు పిల్లలకు రక్షణ కల్పించాలని, మహిళలపై జరుగుతున్న ఈ అత్యాచారాలు భారతావని సిగ్గుపడేలా ఉన్నాయని తెలిపారు. దోషులను కఠినంగా శిక్షించేంతవరకు పోరాటాలు సాగుతూనే ఉంటాయని, గతంలో ఢిల్లీ నడిబొడ్డులో జరిగిన నిర్భయ లాంటి ఘటనలు ఎన్ని జరిగినా నేరస్తులకు కఠినమైన శిక్షలు పడటం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీ.ఐ.టీ.యూ. జిల్లా ఉపాధ్యక్షులు వి.వి శ్రీనివాసరావు మాట్లాడుతూ వేలాదిమంది ప్రాణాలు కాపాడిన డాక్టర్ కే ప్రాణరక్షణ లేకుండా పోయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి, మధ్యాహ్న భోజన కార్మికులు సిఐటియు నాయకులు, ఆర్.దేముడు నాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాలలో రాణించడానికి నిత్యం కృషి చేయాలి

సినీ నేపథ్య గాయకుడు శ్రీ కృష్ణ

విశాలాంధ్ర - పాయకరావుపేట: శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలు 48వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలలో భాగంగా రెండు రోజుల పాటు శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల వివిధ శాఖల (తుని, పాయకరావుపేట, అన్నవరం, పెద్దాపురం, కాకినాడ, రాజమహేంద్ర వరం) విద్యార్థుల మధ్య గాతా రహే మేరా దిల్ పేరిట పాటల పోటీలను నిర్వహించారు. ఈ పాటల పోటీల నందు ఆరవ తరగతి నుంచి డిగ్రీ విద్యార్థుల వరకు జూనియర్, సీనియర్ విభాగాలలో పాటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ నేపథ్య గాయకులు శ్రీ కృష్ణ, కీ బోర్డు ప్లేయర్ రవి శేఖర్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థులను, తల్లిదండ్రులను ఉద్దేశించి ముఖ్య అతిధి శ్రీ కృష్ణ మాట్లాడుతూ కేవలం విద్యనే కాకుండా విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసే ఇలాంటి కార్యక్రమాలు పాఠశాల యాజమాన్యం నిర్వహించడం ఎంతో గొప్ప విషయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేటూరి సుందరరామ్మూర్తి పాటలను, సంగీత దర్శకులు ఆర్ డి బర్మన్ పాటలను ఎంపిక చేసుకోవడం కార్యక్రమానికి ఎంతో వన్నె తెచ్చిందని తెలిపారు. పోటీల నందు విద్యార్థినీ విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచారని, నిత్య సాధన చేస్తే వీరు భవిష్యత్ లో మంచి గాయకులుగా రాణించగలరనడంలో అతిశయోక్తి లేదని తెలిపారు. శ్రీకృష్ణ తన పాటల ద్వారా ఆహుతులను ఉర్రూతలూగించారు. రవి శేఖర్ కీబోర్డ్ పై పలు పాటలను వినిపించి అటు విద్యార్థులను ఇటు ప్రేక్షకులను ఉత్సాహపరిచారు. విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేరుస్తుందని, శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలు అటువంటి నిబద్ధతతోనే గత 48 వసంతాలుగా పనిచేస్తున్నాయని తెలిపారు. విజేతలకు బహుమతులను అందచేశారు. విజేతలను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కే. నరసింహారావు, ట్రజరర్ సిహెచ్. రామసీత అభినందించారు.